క్లుప్తంగా

సుధాకర్ సేవలు మరువలేనివి



మొగుళ్లపల్లి: విద్యుత్ శాఖలో 30 సంవత్సరాలుగా పని చేసి పదవీ విరమణ పొందుతున్న మొట్లపల్లి లైన్ ఇన్‌స్పెక్టర్ కొండేటి సుధాకర్ సేవలు మరువలేనివని విద్యుత్ శాఖ డీఈ పాపిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ పాపిరెడ్డి హాజరై మాట్లాడారు. ఉద్యోగంలో పదవీ విరమణ సహజమని అన్నారు. అనంతరం సుధాకర్ దంపతులకు శాలువాలతో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సందీప్ పాటిల్, ఇన్‌చార్జ్ ఏఈ సంజయ్, ఐఎన్‌టీయూసీ 327 జిల్లా అధ్యక్షుడు కట్ల సదయ్య, జిల్లా నాయకులు నిమ్మల మల్లేశం, జక్కు రాజేందర్, టీఆర్ వీకేఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్ , లైన్‌మేన్ సత్యం, శ్రీనివాస్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



గోవిందరావుపేట : యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో యువకులకు క్రికెట్ కిట్, స్పోర్ట్స్ టీ షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ యువకులు క్రీడాస్ఫూర్తితో రాణించాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం గ్రామంలో నాయకపోడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న లక్ష్మీదేవర ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు విరాళం అందజేశారు. లక్ష్మీదేవరకు గుడితో పాటు విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సాయం కావాలని గ్రామ, మండల కమిటీ నాయకులు జిల్లా అధ్యక్షుడికి తెలుపగా స్పందించిన లక్ష్మణ్‌రావు వెంటనే మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మన్న ఆధ్వర్యంలో రూ.30వేల నగదును అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ కావిరి పద్మ డప్పులు బహూకరించారు. నాయకులు కావిరి చిన్నికృష్ణ, పూజారి కిశోర్, మటం వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షుడు సునార్కని సుధాకర్, దుర్గం రాజు కుమార్, కావిరి అంజన్‌రావు, చింతగూడెం మాజీ సర్పంచ్ దుర్గం నారాయణ, కొండగొర్ల వెంకటయ్య, సునీతరావు,రాజేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



పరకాల: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగానే రాజీవ్ యువశక్తి పథకాన్ని అమలులోకి తీసుకరావడం జరిగిందన్నారు. ఈ నెల 4న పరకాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాబ్‌మేళా నిర్వహించనున్న లలిత కన్వెన్షన్ హాల్‌ను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జాబ్‌మేళాకు చేరుకునే నిరుద్యోగులు బయోడేటాతో పాటు విద్యార్హత జిరాక్స్‌లు, ఆధార్‌కార్డు, పాన్ కార్డు పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాలని సూచించారు.

నియామకం

ఆత్మకూరు : నేషనల్ హ్యూమన్ రైట్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల చైర్మన్‌గా మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన బోళ్ల నరేశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ మండలంలో పౌరుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

నల్లబెల్లి : మండలంలోని గుండ్లపహాడ్ నుంచి నాగరాజుపల్లి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా పెరిగిన పిచ్చిమొక్కలను స్థానిక యువకులు సోమవారం డోజర్‌తో తొలగించారు. యువత శ్రమదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు కడుదూరి అమరేందర్, తోట విజయ్, గోనె వెంకటేశ్, కడుదూరి వంశీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

చిట్యాలలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కాటారంలో..



మొగుళ్లపల్లిలో..





మొగుళ్లపల్లిలో..



కాళేశ్వరం ఈద్గా వద్ద ముస్లిం యూత్ సభ్యులు

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద మతపెద్దలు చెప్పిన ఖురాన్ బోధనల అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి, అలాయ్‌బలాయ్ తీసుకున్నారు. అంతకు ముందు ముస్లింలు ఈద్గాల వద్ద వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అనంతరం ఇంట్లో బంధుమిత్రులకు స్వీట్లు పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



మహదేవపూర్ ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



మల్హర్: ఎడ్లపల్లి బొగ్గుల వాగు వద్ద..



టేకుమట్ల: వెలిశాలలో..



మహదేవపూర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గో ఆధారిత వ్యవసాయం ఎంతో మేలు



సమావేశంలో పాల్గొన్న రైతులు

రేగొండ : గో ఆధారిత వ్యవసాయం రైతులకు ఎంతో మేలని భారతీయ కిసాన్ సంగ్ తెలంగాణ మాజీ ఉపాధ్యక్షుడు పున్నం రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం తండాలో జేబీడీ సొసైటీ, భారతీయ కిసాన్ సంఘ్ సంయుక్తంగా గో ఆధారిత రైతుల సమావేశం ఏర్పాటు చేసి గో ఆధారిత వ్యవసాయ సాగుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రహిత ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. గో ఆధారిత వ్యవసాయంలో జిల్లా దేశానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేబీడీ సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతి రావు, భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు మందల రాఘవ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, వివిధ మండలాల నుంచి మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రేగొండ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టేందుకు మండలంలో ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ జమీర్ పాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో పండ్ల తోటల పెంపకం కోసం గుంతలు తీయడం, మొక్కల కొనుగోలు, మూడు సంవత్సరాల పాటు తోటల నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మామిడి, నిమ్మ, కొబ్బరి, జీడి మామిడి, సపోటా, జామ తోటల పెంపకానికి 5వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు ఉపాధిహామీ అధికారులను సంప్రదించాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని చౌకధరల దుకాణంలో సోమవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. అలాగే 50 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, లింగాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ పథకం చేపట్టినట్లు తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ అనేది నిరంతరంగా కొనసాగుతుందని అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ భరత్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా, మండల నాయకులు సంపత్ రావు, పున్నం రవి, మైస భిక్షపతి, పట్టెం శంకర్, కోగిల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని సింగిరికొండ రమేష్‌గుప్తాకు చెందిన రేషన్‌షాపు నంబర్ 19 వద్ద ఉగాది కానుకగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సంవత్సరం ఉగాది పండుగ చరిత్ర పుటల్లో లిఖించదగ్గ రోజుగా నిలుస్తుందన్నారు. దొడ్డు బియ్యం తినేందుకు ప్రజలు అనాసక్తత కనబరచడంతో పాటు దళారులకు అమ్ముకోవడంతో పక్కదారి పడుతున్నాయనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. అర్హులందరికీ నూతన రేషన్‌కార్డులు అందజేస్తామని తెలిపారు.



రేగొండ: సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై దాసరి సుధాకర్

- ఎస్సై దాసరి సుధాకర్

టేకుమట్ల : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని వెలిశాలలో సీసీ కెమెరాల వినియోగంపై స్థానికులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా దొంతనాలు, ఇతర సంఘటనలో చోటు చేసుకున్నప్పుడు సీసీ ఫుటేజీ కీలకంగా మారుతుందన్నారు. అనుమానితులు గ్రామాల్లో సంచరించినప్పు డు వారిని గుర్తించేందుకు, కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో సహాయపడతాయని అన్నారు. వ్యాపారులు వారి దుకాణాల్లో, గ్రామాల్లోని ప్రధాన కూడలిలో, గ్రామాల ప్రారంభ ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్‌లు చింతలపెల్లి స్వామి రావు, కమురోద్దిన్, హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుల్ వెంకటేష్, మహేందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాటారం: పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



టేకుమట్ల: పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

కాటారం: కాటారం మండలం ధన్వాడలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం పరామర్శించారు. ధన్వాడ మాజీ ఎంపీటీసీ బోడ మమత తండ్రి మృతి చెందగా ఆమె కుటుంబాన్ని, భీముని సత్తక్క, అడ్డూరి రాజేశ్వరీ, కోరుకొప్పుల సమ్మక్క మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చిటూరి మహేశ్, నాయకులు బోడ నరేశ్, భూపెల్లి రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)కి చెందిన మోకిడి పూలమ్మ, సంధ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. అలాగే మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఒరంగంటి సుధాకర్ తల్లి భూలోకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ బండెల నరేష్, నాయకులు ఆది రఘు, బొడ్డు సదానందం, ఉద్దమారి మహేష్ యాదవ్, చంద్రయ్య, స్వామి ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదం

- ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు
- క్యాన్సర్ సోకే అవకాశం
- ప్రజలకు అవగాహన కల్పించని అధికారులు



భూపాలపల్లిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

భూపాలపల్లి అర్బన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను మాత్రమే అనుమతిస్తున్నారు. కానీ ఈ నిబంధనలు జిల్లాలో అమలు చేయడం లేదు. ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. మార్కెట్‌కు వెళ్తే వెంట వస్త్ర సంచులు తీసుకెళ్లాలన్న ఆలోచన ప్రజల్లో ఉండటం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇటు ఆరోగ్యానికి అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతోందన్న కనీస స్పృహ కరువైంది. సాధారణ వస్తువులతోపాటు ఇటీవల కాలంలో వేడి పదార్థాలను కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ప్యాకింగ్ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా జనం పెడచెవిన పెడుతున్నారు. ఇప్పటికైనా వస్తువులు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో ప్రజలు వస్త్ర సంచులు తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలను తెచ్చుకోవడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించాలి.

అధికారుల పర్యవేక్షణ కరువు

జిల్లా వ్యాప్తంగా ఒక మున్సిపాలిటీ, 241 గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు తనిఖీలు చేయడమే మరిచారు. అధికారులు అప్పుడప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా వారికి జరిమానాలు విధి స్తున్నా పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యపడడం లేదు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో తనిఖీలు చే సిన అధికారులు ప్రస్తుతం ఎటువంటి నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవడం లేదు. గ్రా మ పంచాయతీల్లో ఏ మాత్రం దృష్టి సారించడం లే దు. మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి. కాని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ సాధ్యపడడం లేదు. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు.

ప్లాస్టిక్‌ను తగ్గించాలి



ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ముప్పు ఉంటుంది. ప్లాస్టిక్ తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహార పదార్థాల్లోకి చేరుతాయి. వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎంత తగ్గించగలిగితే అంత మేలు.

– డాక్టర్ విద్యాసాగర్, జనరల్ ఫిజీషియన్

ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు

- పర్యావరణానికి విపత్తు. ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి.
- మైక్రో ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోని కణాలను దెబ్బతీస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి.
- మురుగు కాల్వల్లో ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడుతాయి. వర్షాలు పడినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి.
- చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని పశువులు, వన్య ప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటుంది.
- భూమిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడం వల్ల భూసారం తగ్గిపోతోంది. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి పడిపోతాయి.

'గ్రామసభను రద్దు చేయాలి'

వెంకటాపురం(కె) : మండలంలోని వీరభద్రవరంలో నిర్వహించిన పెసా గ్రామసభను అధికారులు వెంటనే రద్దు చేయాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న వీరభద్రవరం గ్రామంలో అధికారులు ఇసుక క్వారీ నిర్వహణకు పెసా గ్రామ సభను నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం కనకదుర్గ సొసైటీకి అర్హత లేదని ఆడిట్ చేయించుకునే వరకు సమయం కావాలని వినతిపత్రం అందజేయగా గ్రామసభను అధికారులు వాయిదా వేశారని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం గ్రామసభ నిర్వహించి ఏక పక్షంగా తీర్మానం చేశారని అన్నారు. ఈ సభను రద్దు చేసి తిరిగి గ్రామ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాటి లక్ష్మణ్, కోరం ప్రసాదరావు, మునేశ్వరావు తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి

- చైర్మన్ ఇప్ప మొండయ్య



మాట్లాడుతున్న ఇప్ప మొండయ్య

మల్హర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సొసైటీ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మండలంలో తాడిచర్ల సహకార కార్యాలయం ఆవరణలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సంఘం వార్షిక నివేదిక, జమ, ఖర్చులను సొసైటీ సీఈఓ సంతోష్ చదివి వినిపించారు. అనంతరం మొండయ్య మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు, సంఘ సభ్యులకు ఎల్పీజీ గ్యాస్ సేవలు, జన ఔషధీకరణ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్ సేవలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. రైతులకు బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. మండలంలోని రైతులకు ఎరువులు సరఫరా చేయడానికి కొన్ని గ్రామాల్లో క్లస్టర్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్లు తిరుపతిరావు, సుంకు రామన్న, పొట్ల రాజమ్మ, సంగెం రమేశ్, బానోత్ సర్వ నాయక్, కోఆప్షన్ మెంబర్స్ ఎడ్ల నారాయణ, మెరుగు రాజయ్య, మేకల రాజయ్య, సంఘం సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పరకాల: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని గండె సీతారాములు అండ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో బాటసారులు, రైతుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ యాజమాని గండె సత్యానందం –ఉదయలక్ష్మీ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో కుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గండె వెంకటేశ్వర్లు –శిరీష దంపతులు, స్థానికులు పాల్గొన్నారు.